క్లుప్తంగా

శక్తి గణపతికి ప్రత్యేక పూజలు



ర్యాలి శక్తిగణపతి ఆలయంలో గులాబ్‌జామ్ కాయలతో పూజ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి కాశీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత విశ్వేశ్వరపుత్ర శక్తి గణపతి ఆలయంలో ఆదివారం సహస్ర రెడ్ ఆపిల్స్ (ఎర్ర గులాబ్‌జామ్ కాయలు) తో పూజ నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని భగవంతుని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా సూర్యచంద్రరావు కుటుంబం గ్రామంలో శివ, కేశవ ఆలయాల నడుమ వేంచేసియున్న కాశీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత విశ్వేశ్వరపుత్ర శక్తి గణపతి ఆలయంలో ఈ పూజలు నిర్వహించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం అభివృద్ధికి విరాళం



రామాలయం అభివృద్ధికి విరాళం అందిస్తున్న మణిబాబు

ఆలమూరు: మండలంలోని కలవచర్లలో ఇటీవల పునర్నిర్మించిన శెట్టిబలిజ రామాలయం అభివృద్ధికి రూ.25 వేల విరాళం అందింది. గ్రామానికి చెందిన వడ్డి మణిబాబు, వెంకటలక్ష్మి దంపతులు తమ మనవడు రామ్‌వెంకట షణ్ముఖ మొదటి పుట్టినరోజు పురస్కరించుకుని ఆ విరాళాన్ని నగదు రూపంలో ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. అనంతరం మణిబాబు కుటుంబసభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అనారోగ్య బాధితురాలికి సాయం



దుర్గారావుకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.11,500 నగదు సాయంగా అందజేశారు. మండపేట మండలం ఇప్పనపాడుకి చెందిన మాసిన ఆదిలక్ష్మి (33) రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ మార్చుకోవాలని డాక్టర్లు చెప్పారు. కిడ్నీ మార్పిడి జరిగే వరకు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి. రైస్ మిల్లులో పని చేసుకునే ఆమె భర్తకి అంత ఆర్థికస్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో ఆదిలక్ష్మి భర్త మాసిన వీర వెంకట దుర్గారావుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.11,500 చెక్కు సాయంగా అందజేశారు.

పెరటి కూరల సాగుపై అవగాహన



ఆకు కూరల సాగును తిలకిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

రాజోలు: పెరటి కూరల సాగుపై మహిళా సంఘాల సభ్యులకు ఆదివారం వేగివారిపాలెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ తాటిపాక యూనిట్ ఇన్‌చార్జ్ పోతురాజు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో తక్కువ స్థలంలో సాగు చేపట్టిన ఆకుకూరలు, కాయగూరల తోటలను మహిళా సంఘాల సభ్యులకు చూపించారు. రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పెరటి కూరలు సాగు చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. వీఓ పద్మ, ఐసీఆర్‌పీ కొల్లాబత్తుల భవానీ, నాగదుర్గ, శ్రీదేవి, గౌరీ, దుర్గాభవానీ, గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో భక్తుల సందడి

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతుంది. అమ్మవారి తీర్థోత్సవాలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా భక్తుల తాకిడి ఏమాత్రం తగ్గలేదు. ఉభయగోదావరి జిల్లాల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి అధికం కావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

పశు వైద్యానికి సుస్తీ

- మూలనపడ్డ సంచార పశు ఆరోగ్యసేవ వాహనాలు
- పశువుల మకాం వద్ద అరకొరగా అందుతున్న వైద్యం
- గతంలో రైతులు మెచ్చిన వైద్యసేవలు



కొత్తపేట పశువైద్యశాల ప్రాంగణంలో తుప్పపడుతున్న సంచార పశువైద్య వాహనం

కొత్తపేట: పశువులకు సత్వర వైద్యసేవలందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సంచార పశు ఆరోగ్యసేవ వాహన సేవలు కుంటుపడ్డాయి. పాపం పశువులు అని ప్రజలు, రైతులు జాలి చూపిస్తున్నా కూటమి ప్రభుత్వానికి మాత్రం జాలి, దయ అనేవి లేనే లేవని రైతులు వాపోతున్నారు. మనుషులే కాదు పశువులు కూడా నిండు ఆరోగ్యంతో ఉండాలని నోరులేని జీవులను జాలితో చూడాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య సేవల వాహనాలను ఏర్పాటు చేసింది. పశువులకు కూడా సాధ్యమైనంత వేగంగా వైద్యసేవలు అందించే సదుద్దేశంతో ప్రతి రెండు మండలాలకు ఒక అంబులెన్స్‌ను, పశువుల డాక్టర్, వైద్య సిబ్బందిని నియమించి గ్రామాల్లో ఎన్నో మూగ జీవాలకు వైద్యసేవలు అందజేసి వాటి ఆరోగ్యానికి బాట వేసింది. వాటి సంతానాభివృద్ధితో పాలవెల్లువను సృష్టించేందుకు, పాడి పశువులతో గ్రామాలు కళకళలాడేలా గత ఎన్నో చర్యలు చేపట్టింది. కానీ కూటమి ప్రభుత్వం వాటన్నింటికీ మంగళం పాడేసింది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సుమారు 1.15 లక్షల పశువులున్నాయి. కూటమి ప్రభుత్వ చర్యల వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు పడటంతో పాటు పశువులను కూడా కోల్పోతున్నారు. పశువుల ఆరోగ్యానికి ఏదైనా ఇబ్బంది కలిగితే దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతుదే. అన్నట్లు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

పశువైద్య సేవల కోసం 1962..

పశు వైద్యసేవలకు గత ప్రభుత్వం 1962 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే పశువులు ఉన్న ప్రాంతానికి వచ్చి వైద్యం చేసేవారు. వాహనంలో ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న పరికరాలు, ల్యాబ్ విభాగం అత్యాధునికంగా తీర్చిదిద్దబడ్డాయి. వాహనంలో ఉన్న ప్రత్యేక లిఫ్ట్ పరికరం ద్వారా గేదెలు, ఆవులను సైతం సులువుగా వాహనంలోకి ఎక్కించి వైద్యం చేసేవారు. అంతేకాకుండా మెరుగైన వైద్యసేవల కోసం పశువులను వాహనం ద్వారానే పశు వైద్యశాలకు తీసుకువచ్చి వైద్యం చేసి తిరిగి ఇంటికి చేర్చే సేవలు అందుబాటులో ఉండేవి. కానీ ప్రస్తుతం ఈ వాహనాలు అందుబాటులో లేకపోవడంతో పశువులకు సత్వర వైద్యం అందడంలేదని రైతులు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో ఘనమైన సేవలు

మానవాళికి అజరామరమైన సేవలందిస్తున్న 108 వాహనాలను దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ ప్రతిష్ఠాత్మకంగా పశు వైద్యానికి సంచార వాహనాలను ప్రవేశపెట్టారు. రెండు మండలాలకు ఒక వైఎస్సార్ సంచార పశువైద్య ఆరోగ్యసేవ వాహనాలను ఏర్పాటు చేశారు. పశువుల ఫారాలు, పశు పెంపకాల ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలందించేందుకు ఎంతగానో దోహదపడ్డాయి. అనతి కాలంలోనే ఈ సంచార వాహన వైద్యసేవలు రైతాంగం మన్ననలు పొందాయి. నిత్యం 20కి పైగా పశువులకు వైద్యసేవలు అందే పరిస్థితి ఉండేది.

వైద్య సేవలు తిరిగి ప్రారంభించాలి



పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో గతంలో ఏర్పాటు చేసిన సంచార పశు వైద్య సేవలు తిరిగి ప్రారంభించాలి. మనుషులు అయితే నోటితో చెబుతారు. కానీ పశువులు చెప్పుకోలేవు కదా! అందుకే వాటి ఆరోగ్యాన్ని పశువైద్యాధికారులే కాపాడాలి.

– చోడపనీడి సత్తిబాబు, పాడి రైతు, వాడపాలెం

పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలి



గతంలో మనుషులతో సమానంగా పశువుల ఆరోగ్యానికి ఆధునాతన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. దానిలో భాగంగా సంచార వైద్య వాహనాలు ప్రవేశపెట్టారు. గత కొంతకాలంగా ఆ వాహనాలు రావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం ఆ వాహనాలపై దృష్టి పెట్టి పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలి.

– చింతాకుల ఈశ్వరరావు, కొత్తపేట

పూర్వ విద్యార్థుల కలయిక



ఈదరాడలో ఆత్మీయతను పంచుకున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. 1995లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల త్వాత కలసి ఆత్మీయత, అనురాగాలను పంచుకున్నారు. నాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుని మురిసిపోయారు. గురువులు చూపిన బాటలో నడిచిన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. గురువుల బోధనలు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని, అందుకు తామే ఉదాహరణ అని పేర్కొన్నారు. తమకు విద్య నేర్పిన గురువులు కంచి సత్యనారాయణ, రాయుడు గంగాధరం, అరవ విస్సు, యాళ్ల చంటి, ప్రసాద్, హనీఫ్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి సౌజన్య, యెరుబండి లక్ష్మీ నారాయణమ్మ, సుజాత, యెరుబండి బాల, ఆకుల బాలాజీ, తదిరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకదశ రుద్రాభిషేకాల్లో 40 మంది, శ్రీలక్ష్మీగణపతి హోమంలో 24 జంటలు, స్వామివారి పంచామృతాభిషేకాల్లో, స్వామివారి గరిక పూజలో చెరొక జంట పాల్గొన్నారు. స్వామి వారి సన్నిధిలో ఎనిమిది మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, పది మందికి తులాభారం, ఒకరికి నామకరణ చేశారు. అన్నప్రాశన ఐదుగురు చిన్నారులకు నిర్వహించారు. స్వామికి 11 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. 35 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2900 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,21,691 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

శ్రీకృష్ణుడే నిజమైన భగవంతుడు

అయినవిల్లి: శ్రీకృష్ణుడు ఒక్కడే నిజమైన దేవుడని సనాతన ధర్మం బోధిస్తుందని ఆయన స్మరణతోనే భగవధామం చేరుకోవచ్చని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ వేద శాస్త్రాలు ఏమి చెబుతున్నాయో అవే మానవులు ఆచరించాలన్నారు. అనంతరం స్వామి మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా లక్ష రుద్రాక్షార్చన



లక్ష రుద్రాక్షార్చనలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: మొగలికుదురులోని జగ్గన్నపేటలో కొలువుదీరిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో చైత్ర బహుళ సప్తమి ఆదివారం లక్ష రుద్రాక్షార్చన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. హర హరా అంటూ భక్తులు శివనామ స్మరణ చేస్తుండగా ఈ పూజని అర్చక స్వాములు వైభవంగా జరిపించారు. బ్రహ్మశ్రీ కారుపర్తి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్షార్చన, రుద్రహోమం, అమ్మ వారికి కుంకుమార్చన పూజలను ఘనంగా జరిపించారు. దీనిలో భాగంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలను వేద మంత్రాలతో రమణీయంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఖేలో ఇండియాకు విద్యార్థుల ఎంపిక



ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. ఈనెల 16న భీమవరం హైస్కూల్లో జరిగిన 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ మాల్‌ఖంబ్ రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌లో సదరు విద్యార్థులు ఎంపికయ్యారు. వివరాలు వ్యాయామోపాధ్యాయుడు బి.రాధాకృష్ణ, ప్రధాన ఉపాధ్యాయుడు పుట్టా సత్యవెంకట సుబ్బారావు తెలిపారు. 10, 9, 7వ తరగతి విద్యార్థులు కె.టైటిష్, కె.తనూజ్, కె.దేవి పై పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి మే 2 నుంచి బిహార్‌లో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలకు అర్హత సాధించినట్టు వారు తెలిపారు. ఎంపికైన వారిని ఎంఈఓ ఎం.విజయశ్రీ, అల్లూరి కృష్ణరాజే, స్థానికులు అభినందనలు చెప్పారు.

నిత్యకల్యాణం.. పచ్చతోరణం..



వాడపల్లిలో స్వామి అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న పండితులు



స్వామివారి అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు

- జనసంద్రంలా వాడపల్లి
- ప్రతి రోజూ తరలివస్తున్న భక్తులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం నిత్య కల్యాణం పచ్చతోరణంలా తిరుమల క్షేత్రాన్ని తలపిస్తోంది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్య ఫలం నానుడితో అశేష భక్తజనం తరలి రావడంతో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి ఆశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా మిగిలిన ఆరు రోజులు కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. వారితో పాటు ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. ఆదివారం స్వామివారి అష్టోత్తర పూజలో ప్రతి రోజు కంటే మించి భక్తులు పాల్గొన్నారు. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు కూడా అత్యధికంగా తరలివచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ- ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు వసంత మండపంలో స్వామివారికి అష్టోత్తర నామార్చన, నిత్య కల్యాణం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు, అన్నప్రసాదన్ని స్వీకరించారు. దేవదాయ- ధర్మదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

- సమాధులకు అలంకరణ
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఆలమూరులో పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించిన క్రైస్తవులు



సఖినేటిపల్లి లూథరన్ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

ఆలమూరు: లోక రక్షకుడైన యేసుక్రీస్తు పునరుత్థానమైన ఈస్టర్ పర్వదినాన్ని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆదివారం వైభవంగా జరుపుకొన్నారు. ఆలమూరులోని ఏటిగట్టు సమీపాన క్రైస్తవ శ్మశాన వాటిక వద్దనున్న పూర్వీకుల సమాధులకు వద్దకు ఆయా సమాధులకు సంబంధించిన కుటుంబ సభ్యులు విచ్చేసి పూలమాలలతో చక్కగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్పంచ్ నేలపూడి లావణ్య శ్మశానవాటికలోని సమాధుల వద్దకు వచ్చిన భక్తులకు కనీస సౌకర్యాలను కల్పించి వారికి అల్పాహారం అందజేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మానవాళిని ఉద్ధరించేందుకే క్రీస్తు జన్మించారని కల్వరి క్రైస్తవ ప్రార్థన మందిరం నిర్వాహకుడు బిషప్ జల్లి జార్జిపాపఫ్, పాస్టర్ జల్లి విక్టర్‌కుమార్ అన్నారు. మానవాళి పాప పరిహారార్థం శిలువపై క్రీస్తు ఏసు మరణం పొంది మూడో రోజు లేచిన ఏసును స్మరిస్తూ మండలంలో క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మానవాళిని ఉద్ధరించేందుకే ఏసుక్రీస్తు జన్మించారని స్థానిక ప్రవచన దేవుని సంఘం యెరూషలేము చర్చి పాస్టర్ బిషప్ జి.అబెద్నగో అన్నారు. ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం గ్రామ గ్రామాన క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మానవాళి పాప పరిహారార్థం శిలువపై మరణం పొంది మూడోరోజున లేచిన ఏసుక్రీస్తును స్మరిస్తూ శనివారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవ ప్రార్థనా మందిరాలైన చర్చిలలో జాగరణ, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మానవుల పాపాలను భరిస్తూ శిలువ కాబడిన ఏసుక్రీస్తు సమాధిని గెలిచి పునరుత్థానం పొందిన సందర్భంగా ఈస్టర్ పండుగను ఆదివారం క్రైస్తవులు ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. తమ పూర్వీకుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మలు పరలోక రాజ్యం ప్రవేశం పొందాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. క్రైస్తవ విశ్వాస కుటుంబాలను పునరుత్థాన దేవుడు ఆశీర్వదించి, దీవెనలు అందించాలని వేడుకున్నారు. పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు, అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మండల కేంద్రంలో లూథరన్ చర్చినందు ఆదివారం జరిగిన ఈస్టర్ పండుగ వేడుకల్లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, యేసు చూపిన సన్మార్గంలో మనం అందరం నడవాలని, సమస్త మానవాళి కోసం ఆయన తన జీవితాన్ని త్యజించారని అన్నారు.

కాగా లూథరన్ చర్చి మీదుగా ఉన్న రహదారి ఆవశ్యకతను గుర్తించి రూ.1.35 లక్షల ఎంపీ నిధులతో సదరు రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యేను స్థానిక మహిళలు, యువత సత్కరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ జరపాలి

పి.గన్నవరం: రాజమహేంద్రవరం వద్ద పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై లోతైన విచారణ జరపాలని కోరుతూ ఎల్.గన్నవరంలో ఆదివారం క్రైస్తవులు శాంతియుత మానవహారం నిర్వహించారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులనును ఖండించారు. ఈ దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమానికి పాస్టర్ జల్లి జాషువా రైమండ్, యన్నాబత్తుల ఆనంద్, మాగాబత్తుల సన్నీ, గెడ్డం ఆనందరావు, పోతుమూడి పెద్ద తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

ఆలమూరు: స్థానిక ఆలమూరు, చొప్పెల్ల సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి ఎమర్జన్సీ లోడ్ రిలీఫ్ (ఈఎల్‌ఆర్) సాకుతో దాదాపు గంటన్నర సేపు విద్యుత్ కోత విధించారు. తదనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినా నిమిషానికోసారి అంతరాయం ఏర్పడుతుంది. దీనిపై విద్యుత్‌శాఖకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. బొమ్మూరులో లేదా రామచంద్రపురం విద్యుత్ స్టేషన్లలో అంతరాయం ఏర్పడుతుందని మాత్రమే చెబుతున్నారు, ఇప్పటికే ట్రూఅప్ చార్జీలతో ప్రజలను బెంబేలెత్తిస్తున్న విద్యుత్‌శాఖ కోతల పేరిట వినియోగదారుల సహనానికి పరీక్ష పెడుతుంది.

ప్రతి ఒక్కరూ పొదుపు పాటించాలి

పి.గన్నవరం: ప్రతి ఒక్కరూ ఖర్చులు తగ్గించుకుని పొదుపు పాటించాలని ధనవర్ష పరస్పర సహాయ సహకార సంఘం చైర్మన్ కంకిపాటి ప్రసాద్ అన్నారు. పి.గన్నవరం శివారు తాటికాయల వారి పాలెం ధనవర్ష ఫంక్షన్ హాలులో జరిగిన సంఘ 26వ వార్షికోత్సవ సభకు ఆయన అధ్యక్షత వహించి, ప్రసంగించారు. 1999లో సంఘాన్ని ప్రారంభించామని, ఇప్పటి వరకూ 7 బ్రాంచీల ద్వారా సభ్యులను సేవలు అందిస్తున్నామని తెలిపారు. పొదుపు చేయాలనే ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ, విద్యార్థులకు పాలిటెక్నిక్ కోచింగ్ ఇస్తున్నట్టు ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ఆడిటర్స్ రామ్మోహన్‌రావు, రమణకుమార్, సంఘ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

పెమ్మాడి సేవలు చిరస్మరణీయం



పి.గన్నవరంలో పెమ్మాడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పి.గన్నవరం: రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘ నాయకుడు దివంగత పెమ్మాడి సుబ్బరాజు మత్స్యకారులకు అందించిన సేవలు చిరస్మరణీయమని పి.గన్నవరం నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు అన్నారు. పెమ్మాడి వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక అక్విడెక్టు పార్కులో ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సమావేశంలో శ్రీనుబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, మాజీ సర్పంచ్‌లు కొపనాతి సీతారామస్వామి, అర్థాని ఏడుకొండలు, నాయకులు మల్లాడి గోపి, కొల్లు రాంబాబు, శేరు తిరుపతిరావు, కళ్యాణరాజు, సుబ్రహ్మణ్యం, కన్నయ్య, యర్రంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫోకస్ ఫ్యూచర్

మలికిపురం: ప్రజల మానసిక వికాసానికి జాతీయ స్థాయిలో నిరంతరం కృషి చేస్తున్న స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 21 సోమవారం ఉదయం 10 గంటలకు మలికిపురం యంవీయస్‌జెయస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ఫోకస్ ఫ్యూచర్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వివేకానంద ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీనటుడు మోటివేషన్ స్పీకర్ కె.వి.ప్రదీప్ ముఖ్యవక్తగాను, ఫౌండేషన్ చైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి రానున్నారు. అలాగే సోమవారం సాయంత్రం విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద స్కూల్ ఆవరణలో జరిగే ఫ్రైడ్ ప్రోగ్రాంలో 8 ఎలెమెంట్స్ ఆఫ్ వెల్నెస్ ప్రోగ్రాం ప్రారంభోత్సవంలో కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే దేవకు వినతిపత్రం ఇస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

మలికిపురం: రాజోలు నియోజకవర్గం పరిధిలోని గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కలిశారు. విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు కలసి రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల విద్యార్హతకు తగిన విధంగా పదోన్నతి చానల్ ఏర్పాటు చేయాలని, దానికి తగిన విధంగా జీతభత్యాలను ప్రభుత్వం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించారు. వినతిపత్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దేవ సానుకూలంగా స్పందించి, దీనిపై సాంఘిక సంక్షేమశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో బత్తుల మోహన్, యెరుబండి దుర్గారావు, శ్రీకిరణ్, ఒలేటి శ్రీనివాస్, గుబ్బల శేఖర్, కటికిరెడ్డి నరేష్, రాజీవ్, బోనం దుర్గ ప్రసాద్, త్రివేణి, అన్నపూర్ణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.